కదిలింది.. కరుణరథం!



సామర్లకోటలో సిలువతో విశ్వాసుల ర్యాలీ

గుడ్‌ఫ్రైడేను జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.. విశ్వాసులు సిలువ మోస్తూ.. కదిలింది కరుణరథం.. సాగిందీ క్షమాయుగం అంటూ పార్థనా గీతాన్ని ఆలపిస్తూ క్రీస్తును కీర్తించారు.. ఉదయం నుంచి చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.. నలభై రోజుల ఉపవాస దీక్షలు ముగించారు.



8 హంసవరంలో..

రెండో ఉచిత సిలిండర్‌కు క్యూ..



- ఉమ్మడి జిల్లాలో వినియోగదారులు 13 లక్షలు
- 2,82,198 మంది గ్యాస్ బుకింగ్
- 1,09,592 మంది ఖాతాల్లో సొమ్ము జమ

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రెండో ఉచిత సిలిండర్‌కు లబ్ధిదారులు క్యూకడుతున్నారు. వేగంగా బుకింగ్‌లు చేసుకుంటున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రతిరోజు పెద్దఎత్తున బుకింగ్స్ జరుగుతున్నాయి. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో సుమారు 13 లక్షల మంది గ్యాస్ వినియోగదారులు ఉన్నారు. ఈనెల ఒకటో తేదీ నుంచి రెండో ఉచిత గ్యాస్ సిలిండర్ బుకింగ్ ఆరంభమైంది. ఇప్పటివరకు 2,82,198 మంది వినియోగదారులు ఉచిత గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకోగా 1,09,592 మంది బ్యాంకు ఖాతాల్లోకి రూ.8.72 కోట్లు సబ్సిడీ సొమ్ము జమ అయింది. మిగిలిన వినియోగదారులకు మరో నాలుగు రోజుల్లో రాయితీ సొమ్ములు జమచేస్తారు. తూర్పుగోదావరి జిల్లాలో 91,382 మంది గ్యాస్ సిలిండర్లకు బుక్ చేసుకోగా 34,645 మంది వినియోగదారుల బ్యాంకు ఖాతాల్లో రూ.2.74 కోట్లు జమ అయింది. కాకినాడ జిల్లాలో 1,03,832 మంది గ్యాస్ సిలిండర్లు బుక్ చేసుకోగా, 41,223 మంది బ్యాంకు ఖాతాల్లో రూ.3.27 కోట్ల రాయితీ సొమ్ము జమచేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 86,984 మంది వినియోగదారులు గ్యాస్ సిలిండర్లకు బుక్ చేసుకోగా, 33,724 మందికి రూ.2.70 కోట్ల రాయితీ సొమ్ము జమచేశారు. వినియోగదారులు రెండో గ్యాస్ సిలిండర్‌ను ఈ ఏడాది జూలై 31వ తేదీలోపు బుక్ చేసుకోవాలని నిబంధన విధించారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ దీపం-2 పథకానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. తొలి విడత, రెండో విడత ఉచిత గ్యాస్ సిలిండర్లు బుకింగ్ చేసుకున్న వినియోగదారులకు ఏదైనా కారణాల వల్ల రాయితీ సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమకాకపోతే ఆయా జిల్లాల పౌరసరఫరాల శాఖ కార్యాలయాల్లో సంప్రదించాలని సంబంధిత అధికారులు వెల్లడించారు.



రె..డీఎస్సీ!

ఉపాధ్యాయ నిరుద్యోగులకు తీపికబురు

- నెరవేరనున్న కూటమి మరో హామీ
- ఉపాధ్యాయ అభ్యర్థుల్లో ఆనందం
- ఉమ్మడి జిల్లాలో 95 వేల మంది పైనే
- 42 నుంచి 44 ఏళ్లకు పెంపు
- వయో పరిమితి పెంపుతో ఊరట
- ఎస్సీ వర్గీకరణపై ఆర్డినెన్స్ జారీ
- సమాయత్తమవుతున్న విద్యాశాఖ

కాకినాడ రూరల్/ అమలాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి. టీడీపీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గురువారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో నేడో రేపో నోటిఫికేషన్ విడుదలకానుంది. ఈనేపథ్యంలో ఎప్పటి నుంచో డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. ఉపాధ్యాయుల పోస్టుల భర్తీపై విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

అడ్డంకులు దాటుకుని..

రాష్ట్రవ్యాప్తంగా డీఎస్సీ నోటిఫికేషన్‌కు కొన్ని లక్షల మంది అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటూ ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీని విస్మరించింది. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా 16,347కు పైగా ఉద్యోగాల భర్తీకి సన్నాహాలు చేసింది. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను నిర్వహించి నవంబరులోనే ఫలితాలు ప్రకటించింది. కొన్ని సాంకేతిక కారణాలు, ఎమ్మెల్సీ కోడ్ అమలు, అభ్యర్థుల వయోపరిమితి పెంపు తదితర సమస్యలపై స్పష్టమైన నిర్ణయం రావాల్సి ఉన్నందున డీఎస్సీ నోటిఫికేషన్ వాయిదా పడుతూ వచ్చింది. ఇటీవల సీఎం చంద్రబాబు, విద్యాశాఖామంత్రి నారా లోకేశ్ అసెంబ్లీ, శాసనమండలి సమావేశాల్లో ఏప్రిల్‌లోనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి ఉపాధ్యాయ పోస్టుల భర్తీని జూన్ కల్లా పూర్తిచేస్తామని ప్రకటించడంతో అభ్యర్థులు నోటిఫికేషన్‌కు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈనెల 20 లేదా 23న డీఎస్సీ నోటిఫికేషన్ వస్తుందని తెలిసి హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 95 వేల మందికిపైగా అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు.

వయోపరిమితి 44

డీఎస్సీ అభ్యర్థులకు వయోపరిమితిని సడలిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం గరిష్ఠ వయోపరిమితి 42 ఏళ్లు కాగా దానిని 44 ఏళ్లకు పెంచారు. 2024 జూలై 1ని కటాఫ్ తేదీగా నిర్ణయించారు.ఈ సడలింపు ఈ ఒక్క డీఎస్సీకి మాత్రమే వర్తిస్తుందన్నారు.

- ఏపీ ఎస్సీ కులాల ఉపవర్గీకరణ ఆర్డినెన్స్-25 జారీచేశారు. దీని ప్రకారం 3 ఎస్సీగ్రూపుల విషయంలో 200 రోస్టర్ పాయింట్ల విధానాన్ని అవలంబించనున్నారు. దీంతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీకి వర్గీకరణ ఆర్డినెన్స్‌తో మార్గం సుగమమైంది.

వైసీపీ తెచ్చిన తంటా..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా స్కూలు అసిస్టెంట్లు, ఎస్జీటీ పోస్టులు మొత్తం కలిపి 1026 ఖాళీగా ఉన్నట్టు విద్యాశాఖ ప్రభుత్వానికి నివేదించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో అమలాపురం ఉప విద్యాశాఖాధికారి పరిధిలో వివిధ సబ్జెక్టులకు సంబంధించి 908 ఖాళీలను గుర్తించినట్టు అధికారులు నిర్ధారించారు. ఇంకా జిల్లాలో కొత్తపేట, రామచంద్రపురం సబ్ డివిజన్ల పరిధిలో ఖాళీల సంఖ్య తేలాల్సి ఉంది. అయితే ప్రభుత్వానికి నివేదించిన జాబితాలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోస్టుల సంఖ్య భారీగా కుదించి నివేదించినట్టు ఉపాధ్యాయ సంఘాల నుంచి ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఎస్జీటీ పోస్టులు రద్దుచేసి వారిని వేరే పోస్టులకు కేటాయించారు. ఆ పరిస్థితుల కారణంగా ఇప్పటికీ ఎస్జీటీ పోస్టుల ఖాళీలపై స్పష్టత లేదని వారు ఆరోపిస్తున్నారు. జగన్ ప్రభుత్వంలో ఎయిడెడ్ పోస్టులను రద్దు చేసి ఆయా పాఠశాలలను మాత్రమే ప్రభుత్వంలో విలీనం చేయడంతో ఉపాధ్యాయుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చే నోటిఫికేషన్‌కు నిరుద్యోగ యువకులు ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్నారు. పోస్టుల్లో కోత విధిస్తే తమకు ఏమాత్రం ప్రయోజనం ఉండదనేది వారి ఆవేదన.

1278 పోస్టులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా 1,278 ఉపాధ్యాయ ఉద్యోగాలను డీఎస్సీ ద్వారా భర్తీచేయనున్నట్టు సమాచారం. స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించి ఆంగ్లం 90, తెలుగు 70, హిందీ 71, గణితం 55, ఫిజికల్ సైన్స్ 59, బయోలాజికల్ సైన్స్ 95, సోషల్ స్టడీస్ 114, సంస్కృతం 5, వ్యాయామ విద్య 199, ఎస్జీటీలు 349, పీజీటీ, టీజీటీ ప్రిన్సిపాల్స్ మొత్తం 171 ఖాళీలు డీఎస్సీ ద్వారా భర్తీచేయనున్నట్టు తెలిసింది.

ప్రత్యేక విద్యకు 288 పోస్టులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ప్రత్యేక విద్యకు సంబంధించి 151 స్కూల్ అసిస్టెంట్లు, 137 ఎస్జీటీ ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీకానున్నాయి. వారంరోజుల్లోపు డీఎస్సీ నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నట్టు సమాచారం.ఈ మేరకు విడిగా నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. నోటిఫికేషన్ ఇచ్చిన 45 రోజుల తరువాత పరీక్షలు నిర్వహించేందుకు విద్యాశాఖ సన్నాహాలు చేస్తోంది.

'సత్ప్రవర్తనతో ఉన్న ఖైదీలకు క్షమాభిక్షను దూరం చేయడం ఏ మాత్రమూ సబబు కాదు. మంచి ప్రవర్తనతో ఉన్నవారికి మరోసారి బాగా జీవించే అవకాశం కల్పించడం సరైన నిర్ణయమే'
- దేశ సర్వోన్నత న్యాయస్థానం

2019లో జైలులో ఆస్పత్రి శంకుస్థాపనకు సీఎం హోదాలో చంద్రబాబు వచ్చినప్పుడు.. 'మీరు మంచిగా మారండి. క్షమాభిక్ష జీవోల కోసం ఒత్తిడి పడొద్దు. నేనున్నాను. చూసుకుంటాను' అని హామీ ఇచ్చారు. అయితే విధి దగా చేసింది. 2019లో జగన్ ప్రభుత్వం వచ్చింది. దీంతో క్షమాభిక్ష అవకాశాన్నిఆ ప్రభుత్వంలో ఖైదీలు కోల్పోయారనే చెప్పాలి. ఇప్పుడు మళ్లీ అవకాశం వచ్చింది.. ఖైదీల విడుదలకు చర్యలు చేపడుతున్నారు.

ఖైదీలకూ.. నేనున్నాని..



జీవిత ఖైదీలకు క్షమాభిక్ష

- కూటమి ప్రభుత్వంలో ఊరట
- సుప్రీం మార్గదర్శకాల అమలు
- జాబితాకు ప్రభుత్వ ఆదేశం
- కసరత్తులో జైలు అధికారులు
- వైసీపీ ప్రభుత్వంలో అన్యాయం
- గత జాబితా చెత్తబుట్టలోకి..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సత్ప్రవర్తన కలిగిన ఖైదీలకు క్షమాభిక్ష విషయంలో గత వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర మనోవేదన మిగిలింది. అప్పట్లో జగన్ ఖైదీల క్షమాభిక్ష పట్ల చేసిన కాలయాపన వారి పాలిట శాపంగా మారింది. 2023లో జాబితా ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉంది. సుప్రీంకోర్టు ఆదేశాలనూ అప్పటి వైసీపీ ప్రభుత్వం పాటించకపోవడంతో ఆ జాబితా ఇప్పుడు చెత్త బుట్టలో పడేసే పరిస్థితి వచ్చింది. దీంతో రెండేళ్లుగా ఆ ఖైదీలు ఎదురుచూపులు చూస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఎస్ఎల్‌పీ (క్రిమినల్) నెం.529/2021లోని సుప్రీం ఆదేశాలను పాటిస్తూ ఈనెల 17న జీవో నెం.71 జారీచేయడంతో పెండింగ్‌లో ఉన్న జాబితా నీరు గారిపోయినట్టేనని చెబుతున్నారు. జైళ్లశాఖ ప్రధాన కార్యాలయం నుంచి వచ్చే ఆదేశాల ప్రకారం క్షమాభిక్షకు అర్హులైన ఖైదీల జాబితా సిద్ధం కానుంది.

నాడు వైసీపీలో ఒక్కసారే..

సుప్రీం మార్గదర్శకాల ప్రకారం ఏడాదికి మూడు దఫాల్లో విడుదలకు అర్హులైన జాబితాలను అధికారులు ఎప్పటికప్పుడు పంపించినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో జగన్ ప్రభుత్వంలో ఎదురుచూపులతో ఖైదీలో జైలులోనే మగ్గిపోయారు. జగన్ జమానా ఐదేళ్లలో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు, మహిళా ప్రత్యేక జైలులో కలుపుకొని సుమారు 60 మంది మాత్రమే బయటకు వెళ్లారు. 2021లో విడుదలకు సుముఖత వ్యక్తం చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసినా ఏడాది ఆలస్యంగా ఆగస్టు 15న 2022లో విడుదల చేశారు. మరో అన్యాయం ఏమిటంటే.. 2022లో వదిలిన ఖైదీలకు 2021ని కటాఫ్‌గా తీసుకున్నారు. అలా కాకుండా 2022 కటాఫ్‌గా తీసుకుంటే మరికొంత మంది తమ కుటుంబాల చెంతకు చేరేవారు.

సుప్రీం మార్గదర్శకాలు..

గతంలో ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం ఖైదీలను విడుదల చేసేవి. దీంతో ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా నిబంధనలు ఉండేవి. వీటిపై సుప్రీం కోర్టులో ఎస్ఎల్‌పీలు దాఖలయ్యాయి. ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టు దేశం మొత్తానికి ఒకే విధమైన మార్గదర్శకాలు విడుదల చేసింది. వాటి ప్రకారం ఆయా రాష్ట్రాలు జీవోలు ఇవ్వాలి. ఈ మేరకు కూటమి ప్రభుత్వం సుప్రీం మార్గదర్శకాలను అనుసరిస్తూ జీవో విడుదల చేసింది.

గతం : సాధారణ జీవిత ఖైదీలకు ఏడేళ్ల శిక్ష, మూడేళ్ల రెమిషన్‌తో కలుపుకొని పదేళ్లు, 498(ఏ), డెకాయిటీ, దొంగతనాలు వంటి నేరాల్లో 14+6, మహిళలకు 3+2, 65 ఏళ్లు దాటిన వాళ్లకు ఐదేళ్ల శిక్ష, రెండేళ్ల రెమిషన్‌తో ఏడేళ్లు శిక్ష పూర్తి చేస్తే క్షమాభిక్షకు అర్హత ఉండేది.

ప్రస్తుతం : అన్ని జెండర్లకూ ఒకేలా నిబంధనలు ఉన్నాయి. మరణశిక్ష పడిన వారికి 14 ఏళ్ల జైలు.. ఆరేళ్ల రెమిషన్ మొత్తంగా 20 ఏళ్ల శిక్ష అనుభవించి ఉండాలి (ఆరేళ్ల రెమిషన్ నమోదు కావాలంటే కనీసం 16 ఏళ్లపాటు సత్ప్రవర్తనతో జైలు జీవితం గడపాలి. జీవిత ఖైదులకు 7+3 ఉండాలి. ఎన్‌డీపీ ఎస్, ఎస్సీఎస్టీ కేసుల్లో, ప్రివెన్షన్ ఆఫ్ టెర్రరిజం చట్టం 2002 ప్రకారం, ఐపీసీ 363ఏ, 364, 364ఏ, 366, 366బీ, 367, 368, 369, 372, 373 ప్రకారం శిక్షపడిన వారు క్షమాభిక్షకు అర్హులు కాదు. మరికొన్ని నిబంధనలు ఇచ్చారు.

ఏడాదికి మూడు సార్లు

సుప్రీం మార్గదర్శకాలను అనుసరించి ఏడాదికి మూడుసార్లు క్షమాభిక్ష జీవోలను విడుదలచేస్తారు. మొదటి ఫేజుకు జూన్1, రెండో ఫేజుకు అక్టోబరు 1, మూడో ఫేజుకు ఫిబ్రవరి 1 కటాఫ్ తేదీలుగా పరిగణిస్తారు. నాలుగు దశల్లో ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది.ఫేజ్ 1లో భాగంగా జనవరి 1 నుంచి 15వ తేదీలోపుగా, ఫేజ్ 2లో మే 1 నుంచి 15వ తేదీలోగా, ఫేజ్ 3లో సెప్టెంబరు 1 నుంచి 15వ తేదీలోగా అర్హులైన ఖైదీలను గుర్తించాల్సి ఉంటుంది. ఆపై జైలు అధికారులు మూడు నెలల్లోగా సంబంధిత పత్రాలు సిద్ధం చేసుకోవాలి. జైలు అధికారులు ప్రిజన్స్ డైరెక్టర్ జనరల్‌కి సిఫారసు చేసిన తర్వాత మూడు నెలల్లో ప్రభుత్వానికి నివేదిక అందాలి. అనంతరం మూడు నెలల్లో ప్రభుత్వ నిర్ణయం వెలువడాలి. ఫేజ్1కి అక్టోబరు 1, ఫేజ్2కి ఫిబ్రవరి1, ఫేజ్ 3కి జూన్1లోగా ప్రభుత్వ నిర్ణయం వెలువడాల్సి ఉంటుంది.

మద్దతు ధరకన్నా ధాన్యం తక్కువకు కొనుగోలు చేస్తే క్రిమినల్ కేసులు

పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ దేవుల నాయక్

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్18 (ఆంధ్రజ్యోతి): రైతుల వద్ద మద్దతు ధర కంటే తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా పౌరసరఫరాశాఖ మేనేజర్ దేవుల నాయక్ హెచ్చరించారు. రైతుల పండించిన ధాన్యం ఆరబెట్టిన చోటగాని, కొనుగోలు కేంద్రంలోగాని టెక్నికల్ సిబ్బంది పరిశీలించి డేటా ఎంట్రీ ఆపరేటర్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసి వెహికల్ మూమెంట్ జీపీఎఫ్ ట్రాక్‌చేసి మిల్లుకు పంపించడం జరుగుతుందన్నారు. రైతులు రబీలో తాము పండించిన ధాన్యాన్ని దళారులు, మధ్యవర్తకులకు అమ్ముకుని మోసపోకుండా నాణ్యత ప్రమాణాలకు లోబడి ఉన్న అన్ని రకాల ధాన్యానికి కనీస మద్దతు ధర పొందాలన్నారు. కాకినాడ జిల్లాలో 225 ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతు సేవ కేంద్రాల్లో ఏర్పాటుచేసి ఇప్పటికే 2,570 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో ఎవరైనా కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరకు కొనుగోలు చేస్తే తమకు ఫిర్యాదు చేయాలన్నారు. 17శాతం తేమ ఉన్న ధాన్యాన్ని తక్షణం పట్టుబడి చేసి మిల్లులకు పంపాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రేడ్ ఏరకం ధాన్యాన్ని రూ1740, సాధారణ రకాలను రూ.1725కు కొనుగోలు చేస్తామని చెప్పారు. జిల్లాలో ప్రతి రైతు వద్ద ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని తెలిపారు.





పిఠాపురం మండలం రాపర్తి గ్రామశివారులో గొర్రిఖండి కాలువకు పడిన గండి.. పిడిందొడ్డి రెగ్యులేటర్ వద్ద బల్లలు లేక ఇసుక బస్తాలే సాగునీటి సరఫరా నియంత్రణ

- వరద పనులకు రూ. 19.65 కోట్లు
- క్లోజర్ వర్కులకు మరో రూ. 8 కోట్లు
- ఇప్పటికే రూ 5.50 కోట్లతో అత్యవసర పనుల నిర్వహణ
- వైసీపీ అయిదేళ్ల పాలనలో సాగునీటి వ్యవస్థ నిర్వీర్యం

రైతుల ఇబ్బందులు తీరేలా..

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

సాగునీటి సరఫరాలో రైతులు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించేలా క్లోజర్, వరద పనుల నిర్వహణకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే ఇరిగేషన్ అధికారులు ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించగా, వారం రోజుల్లో వీటికి ఆమోదం లభించనుంది. వైసీపీ అయిదేళ్ల పాలనలో కాలువల నిర్వహణ, క్లోజర్ పనులకు పైసా విదల్చకపోవడంతో సాగునీటి వ్యవస్థ నిర్వీర్యమైంది. అందుకు భిన్నంగా కూటమి ప్రభుత్వంలో పనుల నిర్వహణకు ముందస్తుగానే కార్యాచరణ సిద్ధం చేసి కాలువలకు నీటి విడుదల నిలిపివేయగానే పనులను ప్రారంభించేందుకు సమాయాత్తమవుతున్నారు. ప్రతి ఏటా ఏప్రిల్ నెలల్లో పంటకాలువలకు సాగునీటి సరఫరా నిలిపివేసి తిరిగి జూన్‌లో విడుదల ప్రారంభిస్తారు. కాలువలు మూసివేసి తిరిగి తెరిచే మధ్య కాలాన్ని క్లోజర్‌గా పరిగణించి ఆ సమయంలో కాలువల నిర్వహణకు అవసరమైన పనులు, కట్టడాలు, కళింగల్స్, రెగ్యులేటర్లు, ఇతర సాగునీటి నియంత్రణ వ్యవస్థలకు మరమ్మతులు నిర్వహించడం, కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, పూడికలు తొలగించడంతో పాటు చివరి ఆయకట్టు వరకూ సాగునీటి సరఫరాకు అవసరమైన పనులను నిర్వహిస్తారు. వీటిని క్లోజర్ పనులుగా వ్యవహరిస్తారు. ఇవి ప్రతి ఏటా నిర్వహిస్తేనే సాగునీటి సరఫరా సక్రమంగా సాగుతుంది. అయితే గత అయిదేళ్ల వైసీపీ పాలనలో క్లోజర్ పనుల నిర్వహణను గాలికి వదిలేశారు. ఫలితంగా సాగునీటి వ్యవస్థ అస్తవ్యస్తమైంది. ఆ సమయంలో వచ్చిన వరదలకు అరకొరగానే పనులు నిర్వహించారు. దాని ఫలితంగా గత ఖరీఫ్, రబీ సమయాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈసారి ఆ పరిస్థితి ఏర్పడకుండా ఉండేందుకుగానూ క్లోజర్ పనులకు కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ ముందుగానే ఇరిగేషన్ అధికారుల నుంచి ప్రతిపాదనలు తీసుకుంది. కాలువలు మూసివేసే సమయానికి పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టింది. వాస్తవానికి గత ఏడాది ఏలేరు, సుద్దగడ్డ, తాండవకు వచ్చిన వరదల కారణంగా ఏలేరు, తాండవ, పంపా, పీబీసీ కాలువలకు కాకినాడ జిల్లాలో భారీగా గండ్లు పడ్డాయి. పిఠాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు, పెద్దాపురం, తుని, కాకినాడ రూరల్ నియోజకవర్గాల పరిధిలో రూ.25 కోట్ల వ్యయంతో 280 పనులను నిర్వహించాలని వరదలు తగ్గగానే ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదించారు. ఇందులో అత్యవసరంగా చేపట్టాల్సిన గండ్లు పూడ్చివేత, ఇతర పనుల నిర్వహణకు రూ.5.50కోట్లను గత అక్టోబరులో మంజూరుచేయగా ఆ నిధులతో రెండు విడతలుగా 67 పనులు నిర్వహించారు. ఇప్పుడు రూ.19.50 కోట్ల వ్యయంతో 213 పనుల నిర్వహణకు ప్రతిపాదనలు పంపారు. అలాగే కాలువలు, రెగ్యులేటర్లు, స్లూయిజ్‌లు, కళింగల్స్ నిర్వహణ, మరమ్మతులు, గుర్రపుడెక్క, పూడిక తొలగింపులు వంటి పనులకు రూ.8 కోట్ల వ్యయంతో 199 పనులను ప్రభుత్వం ఆమోదం కోసం పంపారు. వరద సంబంధిత పనులతో పాటు క్లోజర్ పనులకు వారంలోపే ఆమోదం వస్తుందని ఇరిగేషన్ వర్గాలు చెబుతున్నాయి.



ఏలేరు కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్క

సాగునీటి సంఘాల ద్వారా పనులు

క్లోజర్, వరద పనులన్నింటినీ సాగునీటి సంఘాల ద్వారా నిర్వహించాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. ఈ సంఘాల ద్వారా నామినేషన్ పద్ధతిపై కేటాయించి నిర్వహించాలని నిర్ణయించడంతోపాటు నామినేషన్ పద్ధతిపై పనులు నిర్వహించే పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10లక్షల వరకూ పెంచాలని ప్రతిపాదించారు. దీనికి అనుగుణంగా ముందు పంపిన ప్రతిపాదనల్లో మార్పు చేసి ప్రతి పనిని రూ.10 లక్షలకే పరిమితం చేసి పంపారు. దీనివల్ల పనుల నిర్వహణకు టెండర్లు పిలిచి కాంట్రాక్టు ఖరారైన తర్వాత పనులు చేపట్టేందుకు పట్టే సుమారు 30-40 రోజుల సమయం ఆదా అవుతుంది. ఈ సమయంలోనే పనులన్నింటినీ ప్రారంభించి పూర్తి చేయనున్నారు. గోదావరి కాలువలకు ఏప్రిల్ 22వ తేదీ నుంచి నీటి విడుదలను నిలిపివేయనున్నారు. అదే సమయంలో ఏలేరు కాలువలకు నీటి విడుదలను నిలిపివేస్తారు.

జిల్లావ్యాప్తంగా నాకాబందీ

కాకినాడ క్రైం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఎస్పీ జి బిందుమాధవ్ ఆధ్వర్యంలో గురువారం అర్ధరాత్రి నాకాబందీ నిర్వహించారు. ఎస్పీ, ఇద్దరు ఎస్‌డీపీవోలు, 13 మంది సీఐలు, 21 మంది ఎస్ఐలు, సిబ్బంది కలిసి మొత్తం 10 ప్రధాన కూడళ్లలో జరిపిన ఈ నాకాబందీలో మొత్తం 2,223 వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై 15 కేసులు నమోదు చేశారు. రికార్డులు లేని 61 వాహనాలను సీజ్ చేశారు. అలాగే పెద్దాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో పది ఆవులను తరలిస్తున్న ఓ వాహనాన్ని జంతు హింసా చట్టం కింద కేసు పెట్టారు.



వైద్యం అందితే.. బా'గుండె'..

- కాకినాడ జీజీహెచ్‌లో గుండె వ్యాధులకు అరకొర వైద్యం
- కొన్నేళ్లుగా వేధిస్తున్న వైద్యులు, పరికరాల కొరత

7

సెలవులకు స్వగ్రామం వచ్చి మృత్యువాత

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి





మరణించిన బూల వెంకటరత్నం, (ఫైల్‌ఫొటో)

మామిడికుదురు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురులో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో శుక్రవారం పెదపట్నం లంక గ్రామానికి చెందిన బూల వెంకటరత్నం (34) మృతిచెందాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వెంకటరత్నం సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. కరెంటు సామాన్లు కొనడానికి మామిడికుదురు వచ్చి ప్రమాదానికి గురైనట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. హైదరాబాద్‌లోని సీఎంఆర్ షాపింగ్ మాల్‌లో పనిచేస్తున్న వెంకటరత్నం 3రోజులు సెలవు రావడంతో స్వగ్రామం వచ్చి మృత్యువాత పడ్డాడని కుటుంబ సభ్యులు విలపిస్తున్న తీరు చూపరులకు కలచివేస్తుంది. ఏడేళ్ల క్రితం లక్ష్మీదుర్గతో వివాహం కాగా, వారికి ఐదేళ్ల కుమారుడు భరత్‌శ్రీసాయి, రెండేళ్ల కుమార్తె మాధురిలక్ష్మి ఉన్నారు. వెంకటరత్నం మృతితో తాము జీవనాధారం కోల్పోయామని ఆ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. కేసు నమోదు చేసినట్టు నగరంఎస్ఐ ఎ.చైతన్యకుమార్ చెప్పారు.

ధాన్యం గుట్టను ఢీకొని వ్యక్తి మృతి



వీరవెంకట రమణ (ఫైల్‌ఫొటో)

దేవరపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం యర్నగూడెం కృష్ణంపాలెం సర్వీసు రోడ్డులో ధాన్యం గుట్టను ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. మండలంలో కృష్ణంపాలెం యర్నగూడెనికి చెందిన పుట్టా వీరవెంకటరమణ (30) అమ్మమ్మ ఊరైన కొత్తగూడెంలో ఉంటున్నాడు. రోజువారీ కూలి పనికి వెళ్తుంటాడు. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి సుమారు 2.30 గంటల ప్రాంతంలో యర్నగూడెం నుంచి ద్విచక్రవాహనంపై కొత్తగూడెం వెళ్తుండగా కృష్ణంపాలెం సమీపంలోని రహదారిపై ఆరబెట్టిన ధాన్యం గుట్టను ఢీకొని తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో హైవే అంబులెన్స్‌లో గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలకొట్టి

రాగి వైరు, ఆయిల్ చోరీ

దేవరపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా యర్నగూడెం, సంగాయిగూడెం మధ్యలోని ఆచంట శేషారావుకు చెందిన పొలంలో గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలకొట్టి విలువైన రాగి వైరు, ఆయిల్‌ను దొంగిలించుకుపోయారు. దీనిపై విద్యుత్ శాఖ ఏఈకి, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు శేషారావు పేర్కొన్నాడు. ఇటీ వల పొలాల్లో విద్యుత్ వైర్లు కోసుకుపోవడం, ట్రాన్స్‌ఫార్మర్‌లను ధ్వంసం చేసి రాగి వైర్లు దొంగిలించటం వంటి సంఘటనలు జరుగుతున్నాయని, పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు.

సంగాయిగూడెంలో చోరీ జరిగిన ప్రదేశం

రూ.200 నోటు మార్చాలని కోరినందుకు..

వ్యక్తిపై కిరాణా షాపు యజమాని, అనుచరుడి దాడి

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రూ.200 నోటుకు సిరా మరక ఉందని, నోటు మార్చాలని కోరినందుకు తనపై దాడికి పాల్పడ్డారంటూ జనిపల్లి శ్రీను ఇంద్రపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకెళితే కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ గాంధీబొమ్మకాలనీకి చెందిన జనిపల్లి శ్రీను గురువారం మధ్యాహ్నం రూ.500 నోటు ఇచ్చి స్థానికంగా జనచైతన్య లేఅవుట్‌కాలనీకిచెందిన లక్ష్మీ కిరాణా షాపు వద్దకు వెళ్లి సుమారు రూ.300 విలువ కిరాణా సామాన్లు కొనుగోలు చేశాడు. దీంతో ఆ షాపు యజమాని మిగిలిన చిల్లరతోపాటూ రూ.200 నోటు ఇచ్చాడు. సిరా ఇంక్ మరక అంటిన నోటుకిబదులు మరొక నోటు ఇవ్వాలని యజమానిని కోరగా, ఇద్దరి మధ్య ఘర్షణ జరగ్గా యజమాని తన అనుచరుడ్ని ఫోన్ చేసి రప్పించి తనపై కర్రతో చేతిపై, బుర్రపై దాడి చేయించినట్టు బాధితుడు శ్రీను తెలిపాడు. విషయం తెలుసుకున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ బాధితుడ్ని పరామర్శించి దాడికి పాల్పడిన వ్యాపారి, అనుచరుడుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధితుడికి మద్దతుగా నిరసన తెలిపారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇంద్రపాలెం ఎస్ఐ సూర్యకుమార్ తెలిపారు.

హైవోల్టేజీ సమస్యతో

20 టీవీలు, 10 ఫ్రిజ్‌లు, 20 ఫ్యాన్లు దగ్ధం

కామరాజుపేటలో సంఘటన



గోకవరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం మండలంలోని కామరాజుపేటలో హైవోల్టేజ్ సమస్యతో గురువారం రాత్రి గృహోపకరణ వస్తువులు దగ్ధమయ్యాయి. గ్రామంలోని పెద రామాలయం వీధిలో ఈ సం ఘటన జరిగింది. వినియోగంలో ఉన్న సుమా రు 20 టీవీలు, 10 ఫ్రిజ్‌లు, 20 ఫ్యాన్‌లు, మోటార్లు, ఏసీలు, తదితర గృహపకరణ సా మాగ్రి హైవోల్టేజ్‌తో కాలిపోవడంతో బాధితులు లబోదిబోమంటు న్నారు. ఈప్రాంతంలో ఎంతోకాలం నుంచి హైవోల్టేజ్, లోవోల్టేజ్ సమస్య వేధిస్తున్న ప్పటికీ సంబంధింత అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



కాలిపోయిన గృహోపకరణ వస్తువులు

ఉపాధ్యాయులందరూ 26లోపు

నూతన మెడికల్ సర్టిఫికెట్ పొందాలి

కాకినాడ రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ పాఠశాల విద్యా శాఖ సంచాలకుల ఉత్తర్వుల ప్రకారం పూర్వపు తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని ప్రభుత్వ, జడ్పీ, ఎంపీ, మున్సిపాల్టీలు, కార్పొరేషన్ల కింద పనిచేస్తున్న ఉపాధ్యాయులందరూ బదిలీ నియంత్రణ చట్టం ప్రకారం నూతన మెడికల్ సర్టిఫికెట్ పొందాలని కాకినాడ జిల్లా డీఈవో రమేష్ కోరారు. ప్రిఫరెన్షియల్ కేటగిరీ, ప్రత్యేక పాయింట్లు పొందేందుకు అర్హత ఉన్న వారు కాకినాడ జీజీహెచ్‌లో ఈ నెల 24 నుంచి 26వ తేదీలోపు అనారోగ్య సంబంధిత సర్టిఫికెట్లను చూపించి నూతన మెడికల్ సర్టిఫికెట్ పొందాలన్నారు. ఈ క్యాంపులో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మెడికల్ చెకప్ చేయించుకుని వైద్యుడి నుంచి మెడికల్ సర్టిఫికెట్ తీసుకున్నది మాత్రమే ప్రిఫరెన్షియల్ కేటగిరీలో సమర్పించాలని డీఈవో సూచించారు.



జోడెడ్ల బండి.. జోడీగా వచ్చారండి!

కాకినాడకు చెందిన ఆకి వీర వెంకట నారాయణ సాయిమనోజ్‌కు, గొల్లప్రోలుకి చెందిన గ్రంధి పద్మావతి రత్నలక్ష్మి రాధాదీపికలకు గొల్లప్రోలులోని సత్యకృష్ణ కన్వెన్షన్‌లో శుక్రవారం రాత్రి వివాహం జరిగింది. సాయంత్రం వారిద్దరూ ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్ల బండిపై ప్రదర్శనగా వివాహ వేదిక వద్దకు వెళ్లి అందరి దృష్టినీ ఆకర్షించారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి)

వైద్యం అందితే బా'గుండె'...

- కాకినాడ జీజీహెచ్‌లో గుండె వ్యాధులకు అరకొర వైద్యం
- కొన్నేళ్లుగా వేధిస్తున్న వైద్యులు, పరికరాల కొరత
- వేలాదిగా వస్తున్న రోగులను పరీక్షించేది ఒకరిద్దరు వైద్యులు మాత్రమే

నిరుపేదైన వెంకట్రావుకు ఓ రాత్రి వేళ అకస్మాత్తుగా గుండె నొప్పి వచ్చింది.. వెంటనే అతడిని కుటుంబసభ్యులు ఆపసోపాలు పడి ఆటోపై కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఓపీ తీసుకుని అత్యవసర విభాగంలో చేర్చారు. ఆ సమయంలో గుండెకు సంబంధించిన వైద్యులు లేరో.. ఏమో అతడికి మాత్రం సకాలంలో వైద్యం అందలేదు. ఉదయం ఎప్పుడో డాక్టర్లు వచ్చి వైద్య పరీక్షలు చేశారు. ఛాతిలో నొప్పి వచ్చి కొన్ని గంటలు గడిచినా అదృష్టవశాత్తూ అతడి ప్రాణాలకు ఎటువంటి ముప్పు వాటిల్లలేదు. వాస్తవానికి గుండెలో నొప్పి వచ్చిన వారికి నిమిషాల వ్యవధిలోనే వైద్య పరీక్షలు, వైద్యం అందాలి. లేకుంటే ఒక్కోసారి ప్రాణాలు కోల్పోయే పరిస్థితి కూడా ఉంటుంది. ఇతడే కాదు.. ఇలాంటి వారెందరో కాకినాడ జీజీహెచ్‌కు వచ్చి.. పడరాని పాట్లు పడుతున్నారు. పైసలు ఖర్చు చేసి ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లే స్థోమత లేక ఆసుపత్రిలోనే మగ్గిపోతున్నారు.

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)



కాకినాడ జీజీహెచ్‌లో గుండె వ్యాధుల చికిత్స విభాగం

కాకినాడ జీజీహెచ్‌లో పనిచేసే ఓ పెద్ద డాక్టరమ్మకు రెండు రోజుల కిందట ఓ రాత్రి వేళ సడన్‌గా హార్ట్ స్ట్రోక్ వచ్చింది. వెంటనే ఆమెను ఆగమేఘాల మీద కాకినాడలో ఓ పేరున్న ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడి వైద్యులు ఈసీజీ, టూడీ ఎకోటెస్ట్‌లు, యాంజియోగ్రామ్ ఇలా అత్యాధునిక పరికరాలతో రకరకాల టెస్టులు చేసి, చివరికి స్టంటు వేశారు. ఐసీయూ రూమ్‌లో ఉంచారు. ఆమె ఆర్థికంగా స్థితిమంతురాలు కావడం, ఎంతోమంది పేదలకు వైద్య సేవలందించే పెద్దాసుపత్రిలో పెద్ద డాక్టరమ్మ కావడంతో అన్నీ క్షణాల్లో అందాయి. ఆమెకు ఎటువంటి అపాయం లేదని, విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. అయితే ఎన్నో ఏళ్లుగా ఈ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఈ వైద్య నిపుణురాలు ఎంతోమందికి వైద్యం చేసి ప్రాణాలు నిలిపిన కాకినాడ జీజీహెచ్‌ను వదిలి ప్రైవేటు ఆసుపత్రిని ఆశ్రయించాల్సి వచ్చింది. ఇదంతా ఎందుకంటే...

కాకినాడ జిల్లా ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి.. దశాబ్దాల తరబడి ఎంతో మందికి ఎన్నో రకాల వైద్య సేవలందిస్తోన్న అతి పెద్ద ఆసుపత్రి.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వాసులే కాదు.. అటు పశ్చిమ గోదావరి జిల్లా వాసులు కూడా ఇక్కడికి వైద్యం కోసం వస్తుంటారు. ఎందుకంటే ఈ ఆసుపత్రి అంటే అంత నమ్మకం.. నిష్ణాతులైన వైద్యులు ఉంటారని, మెరుగైన వైద్యం అందించి.. ప్రాణాలు నిలబెడతారనే గట్టి విశ్వాసం. సుమారు వెయ్యికిపైగా ఇన్‌పేషంట్లు ఉండే ఈ ఆసుపత్రిలో సుమారు 500కి పైగా వైద్యులు ఉన్నారు. వారిలో ప్రత్యేక వైద్య నిపుణులు కూ డా ఉన్నారు. అందుకే చుట్టుపక్కల ప్రాంతాల ఆసుపత్రి వారు కూడా అత్యవసర కేసులను ఇక్కడికే రిఫర్ చేస్తారు. ఇంత పేరున్న ఆసుపత్రిలో సామాన్యులకు సరైన వైద్యం సకాలంలో అందడం లేదని జన మెరిగిన సత్యం. ఈ ఆసుపత్రిలోని గుండె వ్యాధుల విభాగం గురించి తెలుసుకోవాలంటే కాస్త గుండె నిబ్బరం చేసుకుని చదవక తప్పదు. ఈ విభాగంలో ప్రస్తుతం ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ మాత్రమే ఉన్నారు. ఇటీవల ఒక అసోసియేట్ ప్రొఫెసర్‌ను నియమించినా విధుల్లోకి చేరలేదు. ప్రొఫెసర్‌తోపాటు మరో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం మెడికల్ విభాగానికి చెందిన హెచ్‌వోడీయే ఈ గుండె వ్యాధుల విభాగాన్ని పర్యవేక్షిస్తున్నారు. ఇద్దరు వైద్యులు, పీజీలు సేవలందిస్తున్నారు. ప్రాథమిక పరీక్షలు చేసినా శస్త్ర చికిత్సలు, స్టంట్లు వేయడంవంటి పరిస్థితులు ఇక్కడ లేవు.

గడిచిన మూడేళ్లలో జీజీహెచ్‌లో గుండె వ్యాధిగ్రస్తుల వివరాలు పరిశీలిస్తే..

2022లో అవుట్ పేషెంట్లు 23080, ఇన్‌పేషెంట్లు 4041
2023లో అవుట్ పేషెంట్లు 26849, ఇన్‌పేషెంట్లు 3179
2024లో అవుట్ పేషెంట్లు 30873, ఇన్‌పేషెంట్లు 3560

రోజుకి 200 మందికి ఓపీ..

ఇటీవల కాలంలో గుండె జబ్బులతో బాధపడే వారి సంఖ్య బాగా పెరిగింది. మారిన ఆహారపు అలవాటు, వ్యాయామం చేయకపోవడం, ఇలా రకరకాల కారణాలతో హృద్రోగులుగా మారుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అత్యవసర కేసులన్నీ కాకినాడ జీజీహెచ్‌కే వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో ప్రత్యేకంగా ఓపీ నిర్వహిస్తుంటారు. ఆయా రోజుల్లో రోజుకి సుమారు 200 మంది వరకు రోగులు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకుంటారు. అలాగే పలు వార్డుల్లోనూ ఇన్‌పేషెంట్లుగా ఉంటూ కొందరు వైద్య సేవలు పొందుతారు.

పరికరాల కొరత..

కార్పొరేట్‌కు దీటుగా ఆసుపత్రిని అభివృద్ధి చేస్తున్నాం.. దాతల సహకారంతో అత్యాధునిక సౌకర్యాలు కల్పిస్తున్నాం అని చెబుతున్నా.. అవన్నీ కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. పెద్దాసుపత్రి అన్న మాటే తప్ప.. పరికరాల కొరత మాత్రం బాగా వేధిస్తోంది. ఇక్కడ క్యాథ్ ల్యాబ్‌లో హృద్రోగులకు వైద్య పరీక్షలు చేస్తారు. యాంజియోగ్రామ్ ద్వారా రక్తనాళాల్లో బ్లాక్‌లను గుర్తిస్తారు. అవి తెరుచుకునేలా స్టంట్లు వేస్తా రు.. పేస్ మేకర్‌తో సాధారణంగా గుండె కొట్టుకునేలా చేస్తారు. నెలకు సుమారు 20 వరకు యాంజియోగ్రామ్ పరీక్షలు చేస్తున్నట్టు సమాచారం. ఇక్కడ ఒక్కో పరీక్షకు రూ.పది వేల విలువైన పరికరాలు ఉండాలి. అయితే వాటిని రోగులే సమకూర్చుకోవాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో వైద్య పరీక్షలకు, చికిత్సకు అవసరమైన సదుపాయాలు తక్షణం కల్పించాల్సి ఉంది. అరకొరగా ఉన్న గుండె వైద్య నిపుణులను తగిన సంఖ్యలో నియమించాలని రోగులు, వారి కుటుంబీకులు కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు

22 మంది క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న సెలక్షన్ కమిటీ చైర్మన్ గోపాలకృష్ణ

రాజోలు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు 22 మంది క్రీడాకారులు ఎంపికయ్యారని సెలక్షన్ కమిటీ చైర్మన్ జొన్నలగడ్డ గోపాలకృష్ణ తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మెన్ అండ్ ఉమెన్ హ్యాండ్ బాల్ ఎంపికలు శుక్రవారం నిర్వహించారు. ఈ ఎంపికలకు సభ్యులుగా బాబీ, చెల్లింగి ప్రసాద్, జిల్లా అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మణ్, భీమేష్‌లు ఎంపికలు నిర్వహించారు. 50 మంది క్రీడాకారులు జిల్లా మెన్ అండ్ ఉమెన్ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొన్నట్టు పాల్గొనగా 22మంది క్రీడాకారులు ఎంపికయ్యారని తెలిపారు. మెన్ అండ్ ఉమెన్ హ్యాండ్‌బాల్ టీమ్ ఈనెల 26,27 తేదీల్లో సత్యసాయి జిల్లా కదిరిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులను గోపాలకృష్ణ, ప్రసాద్, లక్ష్మణ్ అభినందించారు.

కరుణాకర్ రెడ్డి విమర్శలు హేయం

టీటీడీ మెంబర్ జ్యోతుల నెహ్రూ



జగ్గంపేటలో విలేకర్లతో మాట్లాడుతున్న జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థాన గోశాలలో గోవులు మరణించాయని సుదీర్ఘకాలం బోర్డులో పని చేసిన కరుణాకర్ రెడ్డి విమర్శలు చేయడం అత్యంత హేయమని టీటీడీ మెంబర్, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. కాకినాడ జిల్లా జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకర్లతో నెహ్రూ మాట్లాడుతూ టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఎప్పుడైనా టీటీడీ గోశాలను పరిశీలించారా అని ప్రశ్నించారు. అప్పట్లో వైఎస్సార్ తర్వాత జగన్ కరుణాకర్ రెడ్డిని టీటీడీ చైర్మన్‌గా చేస్తే తిరుపతి రైల్వేస్టేషన్లో దర్శనం టికెట్లు బ్లాక్‌లో అమ్మి సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. టీటీడీ బోర్డు, కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలను ఖండించారు. పశు సంపదను సంరక్షించేందుకు టీటీడీ బోర్డు మూడు గోశాలలను ప్రతిష్టాత్మకంగా నడుపుతోందన్నారు. బోర్డు మీటింగ్‌పై అసత్య ఆరోపణలు చేస్తున్న కరుణాకర్ రెడ్డిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని జ్యోతుల నెహ్రూ డిమాండ్ చేశారు.

సత్యదేవుని సన్నిధిలో రైల్వే డీఆర్ఎం పూజలు



సత్యదేవుని దర్శనానంతరం రైల్వే డీఆర్ఎం

అన్నవరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుని సన్నిధిలో శుక్రవారం రైల్వే డీఆర్ఎం నరేంద్రపాటిల్ కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు తదితరులున్నారు. అలాగే స్వామి వారి సన్నిధిలో శుక్రవారం కాకినాడ అర్బన్ డవలెప్‌మెంట్ చైర్మన్ తుమ్మల రామస్వామి కుటుంబసభ్యులతో స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఆయన వెంట దేవస్థానం ఉద్యోగుల సంక్షేమసంఘం అధ్యక్షుడు గంటా విష్ణు ఉన్నారు.

పాదగయలో...

పిఠాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రాన్ని విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) నరేంద్ర ఆనందరావు పాటిల్ శుక్రవారం సందర్శించారు. కుటుంబసభ్యులతో కలిసి పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పుర్రుతికాఅమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. క్షేత్రప్రాశస్త్యం ఆలయ వేదపండితులు వివరించి ఆశీర్వచనాలు పలికారు. ఆలయ అధికారులు డీఆర్ఎంను శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. డీఆర్ఎం వెంట అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ బి.శివప్రసాద్, సామర్లకోట రైల్వేస్టేషన్ మేనేజరు ఎం.రమేష్, కాకినాడ ట్రాఫిక్ ఇనస్పెక్టర్ వెంకటగిరి, సీనియర్ సెక్షన్ ఇంజనీర్ జనార్ధనరావు, ఎంప్లాయిస్ సంఘ్ ప్రతినిధులు టి.ఈశ్వరరావు, జి.రవికాంత్ తదితరులు ఉన్నారు.



పిఠాపురం పాదగయ క్షేత్రంలో పూజల్లో పాల్గొన్న రైల్వే డీఆర్ఎం కుటుంబ సభ్యులు

అన్నవరం దేవస్థానంలో మద్యం తాగి ఉద్యోగి విధులు

క్రమశిక్షణా చర్యలకు ఈవో ఆదేశం

అన్నవరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో దిగువ ప్రసాదం కౌంటర్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి మద్యం తాగి ఉండడం, ఒక భక్తురాలిపై దురుసుగా ప్రవర్తించడంతో అతడిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఈవో సుబ్బారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే.. కొండదిగువన ప్రసాదం కౌంటర్లో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సుబ్బారావు మద్యం తాగి విధులు చేస్తుండడమే కాకుండా దురుసుగా ప్రవర్తిస్తున్నాడని ఫిర్యాదు చేయడంతో ఈవో సుబ్బారావు నేరుగా వెళ్లి ఉద్యోగి కి బ్రీత్ ఎన్‌లైజర్ చేయగా 150 శాతం ఉండడంతో మద్యం తాగి ఉన్నట్లు గుర్తించారు. దీనిపై చర్యలకు ఆయన ఆదేశించారు. ఇటీవల కాలంలో దేవస్థానంలో పలువురు మద్యం తాగి విధులకు రావడం చర్చనీయాంశమైంది.

సూపరింటెండెంట్ బదిలీ

అన్నవరం దేవస్థానంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఐవీ రామారావును ద్వారకా తిరుమల దేవస్థానానికి బదిలీ చేస్తూ దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల దేవస్థానంలో పలు వివాదాలు రావడానికి ఆయన ప్రధాన కారణంగా నిలిచారని ఈవో, సిబ్బందికి అంతరం ఏర్పడడానికి ఆయనే కారణమంటూ పలు ఆరోపణలు వినిపించాయి. ఇక్కడ విషయాలను క్షుణ్ణంగా తెలుసుకున్న కమిషనర్ బదిలీ వేటు వేశారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

పిఠాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పాదగయలో నిత్యాన్నదాన పథకానికి పట్టణానికి చెందిన బొండా సుబ్బారావు రూ.లక్ష విరాళాన్ని శుక్రవారం అధికారులకు అందజేశారు. కొత్త సూర్యనారాయణ (బొండా పెద్ద బాయి) సతీమణి రావయ్యమ్మ జ్ఞాపకార్థం ఈ మొత్తాన్ని అందించి అన్నదానం చేయాలని కోరారు. దాతను అధికారులు సత్కరించి స్వామి, అమ్మవార్ల చిత్రపటం అందజేశారు.



విరాళం అందజేస్తున్న దాత

శ్రామిక.. లేఇక!

స్టాఫ్‌ఫొటోగ్రాఫర్ -రాజమహేంద్రవరం



రాజమహేంద్రవరం నగరాన్ని నిరంతరం శుభ్రంగా ఉంచే శ్రామికులు విధుల్లో మాత్రం కాస్త అజాగ్రత్తగా ఉంటున్నారు. దానికి నిదర్శనం ఈ ఫొటోలే. విధుల్లో భాగంగా ట్రాక్టర్ భాగాన ముందు కూర్చున్న కార్మికులు రోడ్డుపై పడతామేననే ఆలోచన పక్కన పెట్టి ప్రమాదభరితంగా వెళ్తున్నారు. ఒకవేళ ఏదైనా అనుకోని సంఘటన జరిగితే అప్పుడు ఏం చేసినా ప్రయోజనం ఉండదు కదా..

ఈ-వ్యర్థాల డిస్పోజల్‌పై నేడు
అవగాహన ర్యాలీ

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ కోసం ఈ చెక్ థీమ్‌తో ఈ-వ్యర్థాల (ఉపయోగంలో లేని ఎలక్ట్రానిక్ వ్యర్థాలు) డిస్పోజల్‌పై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్టు కమిషనర్ భావన తెలిపారు. ఉదయం 8.30 గంటలకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శారదాంబ గుడి వద్ద ఈ కార్యక్రమం జరుగుతుందని ఆమె చెప్పారు.



కాకినాడ రూరల్ మండలం పండూరులో ఏసుక్రీస్తు కల్వరి శిలువ యాత్ర



పిఠాపురంలో శిలువ మోస్తున్న ఏసుక్రీస్తు వేషధారి

భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

చర్చిల్లో క్రైస్తవ విశ్వాసుల ప్రత్యేక ప్రార్థనలు

పిఠాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు తమ కళ్లముందే సజీవంగా ఉన్నాడా అనిపించే రీతిలో క్రీస్తుతో శిలువ మోయించడం, కిందపడినా హింసించడం, ఆపై శిలువధారణ తదితర ఘట్టాలను కళ్లకు కట్టిన రీతిలో ప్రదర్శించారు. వీటిని ప్రత్యక్షంగా వీక్షించిన క్రైస్తవులు కన్నీరు పెట్టుకున్నారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా పట్టణంలోని ఇందిరానగర్ ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో సజీవ శిలువ ప్రదర్శన నిర్వహించారు. పురవీధుల్లో శిలువను మోసుకుంటూ ప్రదర్శన సాగించారు. శిలువ మోసుకుంటూ వస్తున్న ఏసుక్రీస్తు వేషధారుడు దానిని మోయలేక కింద పడటం, చివరిగా శిలువ వేసే దృశ్యాలు అందరి హృదయాలను కదిలించాయి. కార్యక్రమంలో క్రైస్తవులు, పాస్టర్లు పాల్గొన్నారు.

పిఠాపురం రూరల్ (ఆంధ్రజ్యోతి): చిత్రాడలోని ఏబీసీ చర్చిలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు జరిగాయి. క్రీస్తును శిలువ వేయడం తదితర అంశాలను పాస్టర్లు వివరించారు. క్రీస్తును స్మరించుకుంటూ ప్రార్థనలు చేశారు.

కరప (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్స్ ఫెలోషిప్ మండల అధ్యక్షుడు పి.సత్యప్రసాద్ బాబు, కార్యదర్శి పి.శామ్యూల్‌రాజు, కోశాధికారి ఆర్.ప్రతాప్‌కుమార్, ఉపాధ్యక్షుడు డి.ఏసురత్నం, సంయుక్త కార్యదర్శి భరత్‌కుమార్, కె.శేఖర్‌మోజెస్, జె.పాల్‌ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు ఐ.జాన్‌సూర్యప్రకాష్, ఛైర్మన్ డాక్టర్ స్టీఫెన్‌బాబు, పీవీ ఇమ్మానుయేల్ తదితరులు పాల్గొన్నారు.



కాకినాడ సాంబమూర్తినగర్‌లో శిలువ యాత్ర

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని చర్చిలు విశ్వాసులతో కిటకిటలాడాయి. క్రీస్తుకు శిలువ వేసిన తర్వాత చెప్పిన ఏడు సూక్తులను గుర్తు చేసుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రత్యేక గీతాలు ఆలపిస్తూ, బైబిల్ పఠిస్తూ ఆధ్యాత్మిక చింతనలో గడిపారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): పునీత ఆంటోని పుణ్యక్షేత్రం ఆధ్వర్యంలో పట్టణంలోని గడియార స్తంభం సెంటరు నుంచి బ్రౌన్‌పేట ఆర్‌సీఎం దేవాలయం వరకు శిలువ ర్యాలీ నిర్వహించారు. ఏసుక్రీస్తు శిలువను కాకాడ చంద్రశేఖర్ మోయగా, పిలాతుగా సుధాకర్, బంట్రోతులు, పుణ్య స్త్రీలుగా సంఘస్తులు పాల్గొన్నారు. ఎస్ఐఎం సిస్టర్స్ ఉపదేశకులు, సంఘ పెద్దలు, మరియ దళ సభ్యులు, యూత్ సభ్యులు భక్తిభావంతో పాల్గొన్నారు.

కార్పొరేషన్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి): గుడ్ ఫ్రైడేను క్రైస్తవులంతా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శిలువలో క్రీస్తు పలికిన ఏడు మాటలను స్మరించుకుంటూ ప్రార్థనలు చేశారు. శిలువ ధ్యానం పాటలు పాడుతూ బోధనలు సాగించారు. క్షమాగుణం కలిగి ఉండడమే క్రైస్తవం అని చర్చిల్లో పాస్టర్లు ప్రబోధించారు. తండ్రి అయిన దేవుడు తనకు అప్పగించిన బాధ్యతను పూర్తి చేశానని, సమాప్తమైనది అంటూ యేసుక్రీస్తు పలికిన మాటలను స్మరించారు.

కాకినాడ (ఆంధ్రజ్యోతి): నగరంలోని జగన్నాథపురం, రామారావుపేట తదితర ప్రాంతాల్లో ఉన్న చర్చిల్లో శిలువమార్గం చేస్తూ పాదయాత్రగా వెళ్లారు. సాంబమూర్తినగర్‌లోని ఓ చర్చిలో ఏసుక్రీస్తు వేషధారణలో శిలువను భుజాన మోసుకుంటూ తీసుకువెళ్లే దృశ్యాలు అందరినీ కంటతడి పెట్టించాయి.

సర్పవరం జంక్షన్ (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ రమణయ్యపేట బాలాజీనగర్‌లోని ఫెయిత్ జెరూసలేం ప్రార్థనా మందిరం దైవ ఉపాసకుడు రెవరెండ్ సమర్పణరావు, పద్మ ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే నిర్వహించారు. ఏసుక్రీస్తును స్తుతిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి శిలువ సమయంలో ఏసు చెప్పిన ఏడు మంచి వాక్యాలను వివరించారు. పండూరులో జాక్సన్ మినిస్ట్రీస్ పెంతెకోస్తు ప్రార్థనా మందిరం పాస్టర్ కె.రవిజయంత్ ఆధ్వర్యంలో సుమారు 500 మందితో కల్వరి శిలువ యాత్ర చేపట్టారు. క్రీస్తుకు శిలువ వేయడం, కల్వరి వద్ద మరణం, క్రీస్తు జ్ఞాపకాలను గుర్తు చేస్తూ గుడ్ ఫ్రైడే విశిష్టతను వివరించారు. అధిక సంఖ్యలో క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.



కాకినాడ ఎస్కోల్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు



పిఠాపురం మండలం చిత్రాడ ఏబీసీ చర్చిలో...



వేట పరిహారం రెట్టింపు అంశాన్ని మత్స్యకారులకు వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

'మత్స్యకారులకు వేట పరిహారం హామీ అమలు'

కొత్తపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ యువగళం పాదయాత్రలో మత్స్యకారుల వేట పరిహారం రెట్టింపుపై ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఉప్పాడ తీర ప్రాంతంలో పర్యటించి మత్స్యకారులకు ఈ విషయాన్ని వివరించారు. పర్యటనలో తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షుడు అనిశెట్టి సత్యానందరెడ్డి, మత్స్యకార నాయకులు సూరాడ రాజు, చొక్కా దావీదు, మేరుగు భూషణం, సీకోటి నానాజీ, చోడిపల్లి ప్రసాద్, తిక్కాడ తాతారావు, ఓసిపల్లి అప్పన్న, సనసయ్య, కోడ జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కొండబాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు

'పాస్టర్లకు గౌరవ వేతనం విడుదలపై హర్షం

కాకినాడ సిటీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పాస్టర్లకు గౌరవ వేతనం విడుదల చేయడంపై శుక్రవారం ఎమ్మెల్యే కొండబాబును కాకినాడ పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. పాస్టర్లు కాశరపు సింహాద్రి, జాన్‌రత్నం, ఇస్సాక్, చింతా ఫిలిప్, వనమాడి సుధాకర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నల్లమిల్లి శ్రీకారం

పెదపూడి (కరప), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పెదపూడి మండలంలోని పలు గ్రామాల్లో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శుక్రవారం పర్యటించారు. చింతపల్లి, పుట్టకొండ, కాండ్రేగుల, శహపురంలంక, గండ్రేడు గ్రామాల్లో రూ.1.29 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, పశువుల తొట్టెలు, గోశాలల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. శహపురంలంకలో రూ.20లక్షలతో నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ పనులను ఎమ్మెల్యే పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అధికారులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

'17శాతం తేమ ఉన్న ధాన్యాన్ని మిల్లులకు పంపాలి'

పిఠాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రైతులు నుంచి ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరకు కొనుగోలు చేసే దళారులు, వ్యాపారులు, మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజరు ఎండీ నాయక్ హెచ్చరించారు. పిఠాపురం పట్టణం, మండలంలోని గ్రామాల్లో పంట పొలాలు, కళ్లాల్లో ఉన్న ధాన్యం రాశులను ఆయన శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. 17శాతం తేమ ఉన్న ధాన్యాన్ని పట్టుబడి చేసి తక్షణం మిల్లులకు పంపాలని కొనుగోలు కేంద్రాల సిబ్బందిని ఆదేశించారు. ఏవో అచ్యుతరావు, ఏఈవో రామకృష్ణ, ఎంపీఈవో రాజేష్ పాల్గొన్నారు.



రైతుతో మాట్లాడుతున్న సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజరు నాయక్

'కూటమిది జనరంజక పాలన'

కాకినాడ సిటీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో వైసీపీ రాష్ట్రంలో అరాచక పాలన సాగించిందని, టీడీపీ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జనరంజక పాలన అందిస్తోందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ రాష్ట్రంలో హిందు, ముస్లిం, క్రైస్తవ మతాల ప్రజల మధ్య చిచ్చురేపి కాలం గడపాలని వైసీపీ అధినేత జగన్ కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. గోశాలలో గోవులపై రాజకీయం చేయడం కాదని, ప్రభుత్వ అభివృద్ధిపై చర్చకు రావాలన్నారు. టీడీపీ నగర శాఖ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, ప్రధాన కార్యదర్శి తుమ్మల రమేష్, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ వొమ్మి బాలాజీ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండబాబు

ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ రద్దు చేయాలి: రత్నాకర్

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా శుక్రవారం మాలమహానాడు ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. మాలమహానాడు (రాక్స్) జాతీయ అధ్యక్షుడు రత్నాకర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకై రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వర్గీకరణతో మాలలకు నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మాలలపై జరుగుతున్న కుట్రలను సమష్టిగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. మాల మహానాడు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

పేదలకు బియ్యం పంపిణీ

పిఠాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 10వ వార్డు మిరపకాయల వీధిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం పేదలకు 25 కిలోల వంతున బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ అల్లవరపు నగేష్, నాయకులు సందిన నందీశ్వరరావు, పీఎస్ఎన్ మూర్తి, అద్దంకి వెంకటరమణ, నామా దొరబాబు, సోము సత్యనారాయణ, నూరవరపు సుబ్బారావు, కొరుప్రోలు శ్రీను, రాయుడు శ్రీనుబాబు, సోనాబాబు తదితరులు పాల్గొన్నారు.

హమ్మయ్య...
తొలగించి 'నట్టే'!



నగరంలోని జగన్నాథపురం బ్రిడ్జి రోడ్డుపై స్ప్రింగ్ పోల్స్ విరిగిపోగా ఇనుప నట్టులు తీయకపోవడంతో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను 'ఆంధ్రజ్యోతి' ఈ నెల 14న వెలుగులోకి తెచ్చింది. దీనికి అధికారులు స్పందించి ఆ నట్టులను తొలగించారు. దీంతో పాదచారులు, వాహనచోదకులు ఆనందం వ్యక్తం చేశారు.

ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

కరప రైల్వే స్టేషన్‌లో చెట్ల నరికివేతపై అధికారుల విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కరప, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కరప రైల్వే స్టేషన్‌లో చెట్ల నరికివేతపై ఈ నెల 17న ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి రైల్వే శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. కొట్టేసిన చెట్లను, వాటి మోడులను రాజమహేంద్రవరం ఆర్‌పీఎఫ్, విజిలెన్స్ అధికారులు శుక్రవారం పరిశీలించారు. స్థానికులను కలిసి వివరాలు సేకరించారు. తరలించుకుపోయిన చెట్లను లెక్కించి వాటి విలువను అంచనా వేశారు. చెట్ల అపహరణ ఘటనలో రైల్వే సిబ్బంది పాత్రపై ఆరాతీశారు. చెట్లను నరికి పట్టుకెళ్లిన వారి వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు.



గొల్లప్రోలు మండలంలో పొలాల్లో ఉండిపోయిన ధాన్యం రాశులను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

'ఆందోళన వద్దు... ధాన్యం కొంటాం'

గొల్లప్రోలు రూరల్/పిఠాపురం రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని, వారు పండించిన దాళ్వా వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. గొల్లప్రోలు మండలం ఏపీ మల్లవరం, పిఠాపురం మండలం మాధవపురం గ్రామాల్లో ఆయన శుక్రవారం పర్యటించి పొలాల్లో ధాన్యం రాశులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ ఏడీ పి.స్వాతి, మండల వ్యవసాయాధికారులు అచ్యుతరావు, సత్యనారాయణ ఉన్నారు. గొల్లప్రోలు, చేబ్రోలు, సీతానగరం, లక్ష్మీపురం గ్రామాల్లో ఏవో సత్యనారాయణ, సిబ్బంది పర్యటించి ప్రభుత్వం నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోళ్లపై రైతులకు అవగాహన కల్పించారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇసుకపల్లి, యండపల్లి గ్రామాల్లో జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు పర్యటించారు. రైతులు కళ్లాల్లో ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించారు. ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని, రైతులు అధైర్యపడవద్దని కోరారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు స్వాతి, మండల వ్యవసాయ శాఖ అధికారి వి.జోగిరాజు, ఏఈవో నాగేంద్ర వున్నారు.



సలాదివారిపాలెం సినిమా నిర్మాణానికి క్లాప్ కొడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరావు

'సలాదివారిపాలెం సీనయ్య కథ' షూటింగ్ ప్రారంభం

కాకినాడ రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సలాదివారిపాలెంలో జరిగిన యథార్థ ఘటన ఆధారంగా 'సలాదివారిపాలెం సీనయ్య కథ' చిత్రాన్ని ఐదు భాషల్లో చిత్రీకరించబోతున్నారు. కాకినాడ రూరల్ మండలం కొవ్వూరులోని వారాహి అమ్మవారి పీఠం వద్ద శుక్రవారం ఉదయం పూజ నిర్వహించిన అనంతరం బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు క్లాప్ కొట్టి షూటింగ్‌ను ప్రారంభించారు. కాకినాడ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల శ్రీనివాసరావు కెమెరా స్విచ్ ఆన్ చేశారని సలాది క్రియేషన్స్ అధినేత, చిత్ర నిర్మాత సలాది శ్రీనివాసబాబు తెలిపారు. చిత్రం పోస్టర్‌ను జనసేన, బీజేపీ నాయకులు ఆవిష్కరించారు. డైరెక్టర్ సత్యం సలాది మాట్లాడుతూ భారీ బడ్జెట్, సీనియర్ నటులతో ఈ చిత్రాన్ని నిర్మించనున్నామన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా లారీ ఓనర్స్ యూనియన్ ప్రెసిడెంట్ దుగ్గన నాగరాజు, జనసేన నాయకులు బన్ను, గోవిందు, ప్రసాదరెడ్డి, మనిరాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మ అమ్మవారికి స్వర్ణ పుష్పార్చన



పెద్దాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మరిడమ్మ అమ్మవారి ఉత్సవమూర్తులకు శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున నిత్య కైంకర్యాలు జరిపి ఉత్సవమూర్తులను మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ గర్భగుడి నుంచి ఆస్థాన మండపానికి తీసుకొచ్చారు. అక్కడ ప్రత్యేక వేదికపై అమ్మవారిని అధిష్ఠింపజేసి వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య పూజలు జరిపారు. సహాయ కమిషనర్ కురం విజయలక్ష్మి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

16వ ఆర్థిక సంఘం సమావేశానికి
మర్లావ సర్పంచ్ హాజరు

పెద్దాపురం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా తిరుపతిలో శుక్రవారం జరిగిన 16వ ఆర్థిక సంఘం రాష్ట్ర ప్రతినిధుల సమావేశానికి మర్లావ సర్పంచ్ తోట రామకృష్ణ హాజరయ్యారు. పంచాయతీలకు 16వ ఆర్థిక సంఘం నిధుల కేటాయింపు అంశాన్ని ప్రస్తావించినట్టు ఆయన చెప్పారు.

24న సామూహిక రాయబారం

పెద్దాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ ఈ నెల 24న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఇంటికి సామూహిక రాయబారాలు తీసుకెళ్లాలని నిర్ణయించినట్టు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులతో కలిసి కరపత్రాన్ని ఆవిష్కరించారు. గడిగట్ల సత్తిబాబు, వడ్డి సత్యనారాయణ, వామిశెట్టి స్వామి, క్రాంతి కుమార్, గొల్లబాబు పాల్గొన్నారు.

Anand CINEMAS (4 SCREENS) Experience it in 4K Dolby Atmos
DEVI CINEMAS (4 SCREENS) Experience it in 4K Dolby Atmos
KAKINADA
BOOK YOUR TICKETS on district (paytm) APP



AKKADA AMMAYI IKKADA ABBAYI
11-40AM, 6-40PM
MAD SQUARE : 2-40PM, 9-40PM
MADHURAM : 2-45PM, 6-45PM
GOOD BAD UGLY
11-15AM, 2-20PM, 6-20PM, 9-15PM
ARJUN S/O. VYJANATHI (TEL)
11-30AM, 2-30PM, 6-30PM, 9-30PM

ARJUN S/O. VYJANATHI (TEL)
11-40AM, 2-40PM, 6-40PM, 9-40PM
GOOD BAD UGLY (TEL)
11-30AM, 2-30PM, 6-30PM, 9-30PM
AKKADA AMMAYI IKKADA ABBAYI
11-20AM, 2-20PM, 6-20PM, 9-20PM

వనదుర్గ ఆలయంలో ఘనంగా చండీహోమం

అన్నవరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకులుగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ, సప్తసతి పారాయణలు, మూలమంత్ర జపములు పఠించారు. 11గంటలకు హోమ గుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

వేమవరంలో రక్తదాన శిబిరం

తొండంగి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం వేమవరంలో రక్తదాన శిబిరం జరిగింది. 108 మంది రక్తదానం చేసినట్లు నిర్వాహకుడు శ్రీనివాస్ తెలిపారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

మా చట్టాల జోలికొస్తే ఊరుకోం



సమావేశంలో ఏఎస్‌కే ఆదివాసీ నాయకులు

అడ్డతీగల, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): అడ్డతీగల ఆదివాసీ భవనంలో శుక్రవా రం ఆదివాసీ సంఘాల కూటమి (ఏఎస్‌కే) ముఖ్య నాయకుల అత్య వసర సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ 5వ షెడ్యూల్ ఏరియా అయిన ఏజెన్సీ ప్రాంతంలో అభివృద్ధి పేరిట పర్యాట కాన్ని అడ్డం పెట్టుకుని 1-70 చట్టాన్ని సవరణచేసే ప్రయత్నం ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. మా చట్టాల జోలికి వస్తే ఊరుకోమని ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. టూరిజం వల్ల ఆదివాసీల వలసలు పెరుగుతాయని, దీంతో పీసా చట్టం అమలు జరగకపోతే 1-70 చట్టం నిర్వీర్యమై ఏజెన్సీ చట్టాలకు, హక్కులకు విఘాతం కలు గుతుందన్నారు. కాబట్టి టూరిజం పేరిట వలసలు ప్రోత్సయించే చర్యలు ప్రభుత్వం మానుకోవా లన్నారు. టూరిజం వల్ల ఆదివాసీల బతుకులు మారవని, ఆదివాసీలు వ్యాపారాలు చేసుకుని అభివృద్ధి చెందేలా వారికి ట్రైకార్ ద్వారా రూ.5లక్షల వ్యక్తిగత రుణాలిచ్చి సబ్సిడీ ఇవ్వాలన్నారు. నిరుద్యోగ యువతకు జీవో మూడు స్థానంలో మరో జీవోను ఇచ్చి చట్టం చేయాలని డిమాండ్ చేశారు. తదుపరి నూరు శాతం ఉద్యోగాలు కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసా యానికి అనుసంధానం చేసి రైతుకు ఆర్థికభారాన్ని తగ్గించాలన్నారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి, దళారీ వ్యవస్థను రూపు మాపాలన్నారు. ఆదివాసీ మహిళకు ఇంటి వద్దే ఉండి ఆదాయం పొందే స్వయం ఉపాధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ విద్యలో నాణ్యాత లోపించిందని, దానిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆదివాసీ సంఘాల కూటమి నాయకులు, ఆదివాసీ చైతన్య వేదిక అధ్యక్షుడు వెదుళ్ల లచ్చిరెడ్డి, ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు లోతా రామారావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తీగల బాబూరావు, ప్రదీప్ దొర, కంగాల. అబ్బాయి, చోడి ఏడుకొండలు, ఆదివాసీ ఉద్యోగ సంస్కృత సంక్షేమ సంఘాల నాయకులు, ఆదివాసీ నాయకులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇందుకూరుపేటలో గుడ్‌ఫ్రైడే వేడుకలు



గుడ్‌ఫ్రైడేను నిర్వహిస్తున్న దృశ్యం



మేడివాయి చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న మహిళలు

దేవీపట్నం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఇందుకూరుపేట, తదితర గ్రామాల్లో శుక్రవారం గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు జరుపుకున్నారు. ఏసుక్రీస్తు పాటలు ఆలపిస్తూ పురవీధుల్లో బోలో క్రీస్తు మహరాజ్‌కి జై అంటూ నినాదాలు చేశారు. వార్డుమెంబర్ పి.వీరయ్యమ్మ, ములపర్తి కనక రత్నం ఆధ్వర్యంలో అల్పాహార విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రెవరెండ్ గంధం బాబ్జీ, ఆర్ జేమ్స్, సంఘ పెద్దలు గోళ్ల చంటిబాబు, చిర్రా చిట్టిబాబు, మిట్టపల్లి శ్రీను, కొల్లి నాని, మిరియాల బోసు, పెనుముచ్చి తేజ, మలపర్తి నవదీప్, తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక: గుడ్‌ఫ్రైడేను క్రైస్త వులు శుక్రవారం వేడుకగా జరుపుకున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న చర్చిల్లో క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహిం చారు. ఎటపాక, గౌరిదేవిపేట, వినాయకపురం, బండిరేవు తది తర గ్రామాల్లోని చర్చిల్లో యేసు క్రీస్తు శిలువపై ఉండి పలికిన ఏడు మాటలను, వాటి పరమార్థాన్ని వివరించారు. గౌరి దేవిపేట గ్రామానికి చెందిన మడిపల్లి కొండయ్య శిలువను మోసుకుంటూ యేసుని శిలువ వేసిన వృత్తాంతాన్ని కళ్లకు కట్టినట్లు చూపించాడు. అనంతరం చర్చిల్లో అన్నదానం నిర్వహించారు.

జలవనరుల శాఖమంత్రిని కలిసిన నిర్వాసితులు



మంత్రిని కలిసిన పోచవరం, కాచవరం నిర్వాసితులు

కూనవరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడును కాచవరం, పోచవరానికి చెందిన గ్రామస్తులు కలిసి సమస్యలు విన్నవించుకున్నారు. వరదలు వస్తే తమ గ్రామాల చుట్టూ నీరు చేరి రాకపోకలు స్తంభిస్తున్నాయన్నారు. మా గ్రామాలను మరూన్ గ్రామాలుగా గతంలో ప్రకటించారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తమ గ్రామాలను 41.15మీటర్ల కాంటూరు పరిధిలో కలిపి తమకు పరిహారం అందించాలని కోరారు. ఉన్నతాధికారులతో సమీక్షించి సమస్య పరిష్కరిస్తామని నిర్వాసితులకు మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ అరకు పార్లమెంటు తెలుగు యువత ప్రతినిధి గడేసుల రంజిత్‌కుమార్, సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, షేక్ సుభాని పాల్గొన్నారు.

సోలార్ నీటి పథకాన్ని వినియోగంలోకి తేవాలి

ఎటపాక, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): లక్ష్మీపురం పంచాయతీ పరిధి చింతలపాడు ఆదివాసీ గ్రామంలో తాగునీటి ఎద్దడితో ఆదివాసీలు అవస్థలు పడుతున్నారని, వెంటనే గ్రామంలో మరమ్మతులకు గురైన సోలార్ మంచినీటి పథకాలను వినియోగంలోకి తేవాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా డివిజన్ నాయకుడు సాయన్న కోరారు. శుక్రవారం ఆయన గ్రామంలో పర్యటించారు. వేసవి కావడంతో గ్రామంలో ఉన్న చేతిపంపు ద్వారా తాగునీరు సక్రమంగా రావడం లేదన్నారు. రెండు చోట్ల మరమ్మతులకు గురైన పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.శాశ్వతంగా సోలార్ పథకాలు పనిచేసేందుకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలన్నారు.



మరమ్మతులకు గురైన సోలార్ పథకం వద్ద నిరసన తెలుపుతున్న ఆదివాసీలు



తొండంగిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు.



ఏలేశ్వరంలో ఏసుక్రీస్తు శిలువ మోస్తున్న దృశ్యం



తుని మండలం హంసవరంలో శిలువ ఘట్టాల ప్రదర్శన దృశ్యం

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

తొండంగి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గుడ్ ఫ్రైడే సందర్భంగా మండంలోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తొండంగి బ్లెస్సింగు బాప్టిస్టు చర్చిలో జరిగిన కార్యక్రమంలో భారీ సంఖ్యలో క్రైస్తవులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేసారు. క్రీస్తును శిలువ వేసిన సందర్భాన్ని పాస్టర్ పావని విశ్వాసులకు వివరించారు. మానవాళిని పాపవిముక్తులను చేసేందుకు ప్రభువు శిలువపై ప్రాణ త్యాగం చేశారని, ఆయన త్యాగాన్ని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. ఆయన చూపిన ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వాన్ని అలవర్చుకుని శాంతియుత జీవనం సాగించాలన్నారు.

శంఖవరం, (ఆంధ్రజ్యోతి): కత్తిపూడి ఆర్‌సీయమ్ చర్చి ఫాదర్ చిటికెల రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో శిలువతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించి ప్రార్థనలు, భక్తి గీతాలు ఆలపించారు. క్రీస్తు మానవాళికి అందించిన సందేశాన్ని చదివి వినిపించారు. క్రైస్తవులు పాల్గొన్నారు.

గుడ్‌ఫ్రైడే ప్రత్యేక ప్రార్థనలు

ఏలేశ్వరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరం పట్టణంలోని సెయింట్ జాన్స్ లూథరన్ చర్చి మిషన్, ఆగ్లీలియం చర్చ్ పాస్టర్ ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నగర వీధుల్లో క్రైస్తవులు ఊరేగింపులు చేశారు. గొల్లలమెట్ట కొండపై శిలువ వేసే ఘట్టాలతో ప్రదర్శన జరిగింది. పాస్టర్లు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సజీవ శిలువ యాత్ర

ప్రత్తిపాడు, (ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు సకల మానవాళి పాప పరిహార్థమైశిలువ యాగం పొం దిన రోజును జ్ఞాపకం చేసుకుంటూ ప్రత్తిపాడులో శుక్రవారం గుడ్‌ఫ్రైడే పురస్కరించుకుని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక ఆర్‌సీఎం చర్చి ఫాదర్ రెవరెండ్ కె.చిన్నప్ప ఆధ్వర్యంలో చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటలను జ్ఞాపకం చేసుకున్నారు. అనంతరం శిలువ శాంతి యాత్రను నిర్వహించారు. ఏసుప్రభువుకు శిలువ వేసిన ఘట్టాన్ని ప్రదర్శించారు. ఈ యాత్ర ఆర్టీసీ కాం ప్లెక్స్, అల్లూరి సీతారామరాజు సెంటర్, మార్కెట్, పంచాయతీ, ఎంపీడీవో కార్యాలయ సెంటర్ల మీదుగా గ్రామ పురవీధుల్లో కొనసాగింది. పెద్ద ఎత్తున క్రైస్తవులు పాల్గొన్నారు.

గండేపల్లి (ఆంధ్రజోతి): గుడ్‌ఫ్రైడే సందర్భంగా జడ్.రాగంపేటలో చర్చిల్లో పాస్టర్లు సుదర్శనరావు, నరేంద్రకుమార్, లాజర్, జాన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో గల చర్చి నందు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిచారు. డిప్యూటీ ప్రొఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ యేసు క్రీస్తు త్యాగాన్ని గుర్తు చేసుకోవాలని.. ఆయన చూపిన దయ, ప్రేమ, కరుణా, క్షమా గుణం వంటి సద్గుణాలను ఆదర్శ ంగా తీసుకుని నడవాలన్నారు. ప్రార్థనల్లో చర్చి పాస్టర్ పీటర్, హాస్టల్ చీఫ్ వార్డెన్ పి.ఎల్ ప్రసాదరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

తుని రూరల్, (ఆంధ్రజ్యోతి): గుడ్‌ఫ్రైడే సందర్భంగా పురస్కరించుకుని హంసవరం, తుని పరిసర గ్రామాల చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. హంసవరం చర్చి ఫాదర్ బాలశౌరి ఆధ్వర్యంలో క్రీస్తుకు శిలువ చేసిన ఘట్టాలను ప్రదర్శిం చారు.



ప్రత్తిపాడులో గుడ్‌ఫ్రైడే సందర్భంగా క్రైస్తవుల ప్రదర్శన



ఏలేశ్వరం సువ్వయ్యమ్మపేటలో పగటిపూట వెలుగుతున్న వీధిలైట్లు

పగలూ వెలుతురే..!

ఏలేశ్వరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వీధి దీపాలు నిత్యం పగలూ రాత్రి తేడా లేకుండా వెలుగు తూ నే ఉన్నాయి. సాయినగర్, దిబ్బలపాలెం, సువ్వయ్యమ్మ పేట, శివాలయం పలు వీధుల్లో పగటి పూట కుడా వీధి లైట్లు వెలుగుతుండడం వల్ల విద్యుత్ బిల్లు తడిసి యోపుడవుతుంది. విద్యుత్ పొదుపు పాటించాల్సిన అధికారులు ఏమి సంబంధం లేనట్టు ఉంటున్నారు. ఇకనైనా వీధి దీపాల నిర్వహణను సక్రమంగా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రాచపల్లిలో గుబ్బాలమ్మ జాతర ప్రారంభం

ప్రత్తిపాడు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): రాచపల్లిలో గుబ్బాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారి గరగలను బయటకు తీసి సంబరాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 22న కబడ్డీ పోటీలు, 23న తీన్మార్ ఉత్సవాలు, 26న జాగారం,కోలాటప్రదర్శనలు, 27న అమ్మవారితీర్థం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు పెదిరెడ్డి రాంబాబు తెలిపారు.

నేడు ప్రత్తిపాడులో రక్తదాన శిబిరం

ప్రత్తిపాడు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ఎంపీడీవో కార్యాలయం వద్ద శనివారం కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశాల మేరకు రెడ్‌క్రాస్ రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు తహశీల్దార్ ఎం.సూర్యప్రభ, ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్ బాబు చెప్పారు. మండలంలోని యువత జయప్రదం చేయాన్నారు

నేడు డి.పోలవరంలో ప్రజాదర్బార్

తుని రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కారమే ఎమ్మెల్యే యనమల దివ్య ప్రజా దర్బార్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. శనివారం డి.పోలవరం గ్రామంలో ఈ కార్యక్రమాన్ని వివిధ శాఖల అధికారులతో కలిసి నిర్వహించనున్నట్టు స్థానిక టీడీపీ నాయకులు తెలిపారు.

నేడు తునిలో జాబ్‌మేళా

తుని రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): శనివారం తుని పెంటకోట రోడ్డులో జరగనున్న జాబ్‌మేళాను నియోజకవర్గంలో నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగ పరుచుకోవాలని టీడీపీ యువ నేత యనమల రాజేష్ కోరారు.

'17శాతం తేమ ఉన్న ధాన్యాన్ని మిల్లులకు పంపాలి'

పిఠాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రైతులు నుంచి ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరకు కొనుగోలు చేసే దళారులు, వ్యాపారులు, మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజరు ఎండీ నాయక్ హెచ్చరించారు. పిఠాపురం పట్టణం, మండలంలోని గ్రామాల్లో పంట పొలాలు, కళ్లాల్లో ఉన్న ధాన్యం రాశులను ఆయన శుక్రవారం సాయంత్రం పరిశీలించారు.

'పాస్టర్లకు గౌరవ వేతనం విడుదలపై హర్షం

కాకినాడ సిటీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పాస్టర్లకు గౌరవ వేతనం విడుదల చేయడంపై శుక్రవారం ఎమ్మెల్యే కొండబాబును కాకినాడ పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్లు కాశరపు సింహాద్రి, జాన్‌రత్నం, ఇస్సాక్, చింతా ఫిలిప్, వనమాడి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 20న చంద్రబాబు జన్మదిన వేడుకలు జగ్గంపేటలో ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఎన్టీఆర్ ట్రస్టు తరుపున రాజమండ్రిలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేశామని, నియోజకవర్గంలోని యువత చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, టీడీపీ నాలుగు మండలాల అధ్యక్షులు మారిశెట్టి భద్రం, పోతుల మోహన్‌రావు, చదరం చంటిబాబు, మంగ రౌతు రామకృష్ణ, సమన్వయ కమిటీ సభ్యులు, వీరం రెడ్డి కాశీబాబు, కందుల చిట్టిబాబు, జంపన సీతారామచంద్రవర్మ, ఉంగరాల రాము, పైడి పాల సూరిబాబు, నీలం శ్రీను, దేవరపల్లి మూర్తి, పాలకుర్తి ఆదినారాయణ, రేఖబుల్లిరాజు, పాఠంశెట్టి రవి పాల్గొన్నారు.

అన్ని మతాలను గౌరవిస్తున్నాం: కూటమి ప్రభుత్వం అన్ని మతాలను గౌరవిస్తూ సెక్యూలరిజాన్ని ప్రోత్సహిస్తుందని దానికి నిదర్శనం పాస్టర్లందరికీ నెలకు రూ.5వేలు గౌరవ వేతనం శుక్రవారం విడుదల చేయడం జరిగిందని, నిర్ణయం తీసుకున్న 3 నెలల్లోనే ఈ క్రమాన్ని అమలులో పెట్టడం కూ టమి ప్రభుత్వ విజయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

గోకవరం గంగాలమ్మ జాతరకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

జగ్గంపేట, (ఆంధ్రజ్యోతి), ఏప్రిల్ 18: గోకవరం మండలం గోకవరం గ్రామదేవత శ్రీ గంగాలమ్మ జాతర మహోత్సవాలు ఏప్రిల్ 20 నుంచి 23 వరకు జరగనున్నాయి. ఈ మహోత్సవానికి రావాలని జగ్గపేటఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్య క్షుడు జ్యోతుల నవీన్‌కి ఆలయ కమిటీ సభ్యులు నాగులకొండ శివరాం, ఏనుగు శ్రీనివాసరావు, చిటికెల పాండు, సంగుల చక్కెరరావు, ఎలుగుబంటి చంటిబాబులు ఆహ్వానపత్రిక అంద జేశారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, సూరంపాలెం ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ ఉంగరాల రాము, టీడీపీ గోకవరం మండలాధ్యక్షుడు మంగ రౌతు రామకృష్ణ, సీనియర్ టీడీపీ నేత జంపన సీతారామచంద్ర వర్మ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు మహిళలు విన్నపం

జగ్గంపేట,(ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో రేషన్‌షాపుల్లో బియ్యం స్టాక్ లేదంటూ, కిలోకు రూ.13లు ఇస్తాం తీసుకోండి లేకపోతే వెళ్లిపోండి అంటూ రేషన్ ఇచ్చే వాహనదారులు తెల్లకార్డుదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలవురు మహిళలు శుక్రవారం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు విన్నవించారు. దీంతో వెంటనే ఆయ తహశీల్దార్‌లో మాట్లాడి రేషన్ షాపులను, రేషన్ ఆటోలను సీజ్ చేయమని ఆదేశించారు. ఎక్కడైనా అక్రమాలు జరిగితే వారిని వెంటనే సస్పెండ్ చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కోటనందూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోట నందూరు ఎస్ఐ రామకృష్ణ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం అవగాహన నిర్వహించారు. సోషల్ మీడియా ద్వారా మోసపూరిత ప్రలోభాలకు లొంగవద్దన్నారు. ప్రజలు తమ వ్యక్తిగత డేటా, ఓటీపీ, బ్యాంక్ సమాచారం ఎవరికి తెలియజేయరాదన్నారు.



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

ఒమ్మంగిలో బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



ఒమ్మంగిలో బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభిస్తున్న నాయకులు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఒమ్మంగి జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో శుక్రవారం షటిల్ బ్యాడ్మింటన్, టె న్నికాయిట్ పోటీలు ప్రారంభ మయ్యాయి. కాకినాడ సన్‌రైజ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పా టు చేసిన ఈపోటీలను మాజీ ఎంపీపీ సత్యంశెట్టి సీతా రాం ప్రారంభించారు. కాకినాడ రోటరీక్లబ్, సన్‌రైజ్‌సంస్థలు ఈపోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శ్రీకృష్ణవర్మ, పి.సాయి సుందర్, శామ్యూల్, విజయలక్ష్మి, ప్రోగ్రాం ఛైర్మన్ వి.నగధర్, ఎం. ఆశా, బాలాజీ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండబాబు

కూటమిది జనరంజక పాలన

● కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 18 (ఆంధ్ర జ్యోతి): గత ఐదేళ్లలో వైసీపీ రాష్ట్రంలో అరాచక పాలన సాగించిందని, టీడీపీ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జనరంజక పాలన అందిస్తోందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ రాష్ట్రంలో హిందు, ముస్లిం, క్రైస్తవ మతాల ప్రజల మధ్య చిచ్చురేపి కాలం గడపాలని వైసీపీ అధినేత జగన్ కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. గోశాలలో గోవులపై రాజకీయం చేయడం కాదని, ప్రభుత్వ అభివృద్ధిపై చర్చకు రావాలన్నారు. టీడీపీ నగర శాఖ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, ప్రధాన కార్యదర్శి తుమ్మల రమేష్, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరె క్టర్ వొమ్మి బాలాజీ పాల్గొన్నారు.



కత్తిపూడిలో రోడ్డుపై వర్షపు నీరు

వర్షంతో ఉపశమనం

శంఖవరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం ఉదయం నుంచి ఎండలతో దంచికొట్టినా సాయంత్రం వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు జరిగి ఉరుములతో కూడిన వర్షం కురవడంతో ప్రజలు ఉపశమనం చెందారు. మరోవైపు గాలులతో మామిడి రైతులకు నష్టం వాటిల్లుతుంది.

ప్రత్తిపాడులో చిరుజల్లులు

ప్రత్తిపాడు, (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం చిరుజల్లులు పడ్డాయి. సాయంత్రం ఒక్కసారిగాఆకాశం మేఘావృతమై చిరుజల్లులు పడడంతో వాతావరణం చల్లబడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు తీవ్రస్థాయిలో ఎండ తీవ్రతకు అల్లాడిన ప్రజలు ఈ చిరుజల్లులతో ఉపశమనం పొందారు.



తేటగుంట టీడీపీ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న యనమల

నిరుపేదలకు అండగా ప్రభుత్వం

తుని రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం ఉంటుందని.. సమాజంలో అసమానతలు తొలగించేందుకు పేద, మధ్యతరగతి కుటుంబాలను అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తుందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. తేటగుంట టీడీపీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం తుని, కోటనందూరు, తొండంగి మండలాల ఎంపీడీవోలతో సమావేశం నిర్వహించి వివిధ కార్పొరేషన్ల ద్వారా ప్రభుత్వం విడుదల చేస్తున్న రుణాలను క్షేత్రస్థాయిలో పాదర్శకంగా అందేందుకు అధికారులకు చొరవ తీసుకోవాలని తెలిపారు. అర్హత కలిగిన నిరుపేదలకు రుణాలకు ఎంపిక చేసి రుణ ప్రణాళిక నిర్ణీత గడువులోకి పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామకృష్ణ యనమలతో సమావేశమవ్వగా నియోజకవర్గ పరిధిలో సచివాలయ సిబ్బంది ఖాళీలను బట్టి సర్దుబాటు చేయాలని యనమల కోరారు. మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలు, కూటమి నాయకులు ఉన్నారు.

